క్లుప్తంగా

బడిఈడు పిల్లలను పనిలో పెట్టవద్దు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏహెచ్‌టీయూ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: బడిఈడు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో పనుల్లో పెట్టకూడదని ఏహెచ్‌టీయు (మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం) ఎస్‌ఐ కేశవరావు అన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఉత్తర్వుల మేరకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా నగరంలోని బలగమెట్టు సమీపంలో వివిధ దుకాణ సముదాయాలను సోమవారం తనిఖీ చేశారు. బృందావతి మోటారు మెకానిక్ అండ్ సర్వీసు సెంటరులో 17 ఏళ్ల బాలుడు పనిలో ఉండటం చూసి నిర్వాహకునితో ఇలా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా తీసుకున్న చర్యలకు బాధ్యులవుతారన్నారు. బాలుడికి కౌన్సెలింగ్ చేసి సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచే నిమిత్తం తీసుకెళ్లారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



చందనాన్ని సమర్పిస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలో ఉన్న పత్తేషాబి అమ్మ చందనోత్సవం ముజవర్ని షేక్ అమ్మజీ ఆధ్వర్యంలో సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఫజర్ నమాజ్ అనంతరం ఖురాన్, సలాం పఠనం, చదర్ సమర్పణ చేశారు. భక్తులకు లంగర్ విందు ఏర్పాటు చేశారు. జామియా మసీదు ముఫ్తీ జిల్లా ఖజీ అబ్దుల్ వహాబ్, హుస్సేని మసీద్ ఇమామ్ సుల్తాన్‌లు ప్రత్యేక అతిథులుగా హాజరవ్వగా.. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ముస్లిమ్ మైనార్టీ సభ్యులు ఎం.ఎ.రఫీ, మెహీబుల్లాఖాన్, షకుర్ ఖాన్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎస్.కె.ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఎస్‌కే కామేశ్వరి

లావేరు: మండలంలోని తాళ్లవలసలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంఎస్‌కే ఎస్.కామేశ్వరి సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పౌష్టికాహారాన్ని పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్త ఎం.వెంకటలక్ష్మికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ



విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ మణిభూషణ్

లావేరు: మండలంలోని రావివలస ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు లావేరు పీహెచ్‌సీ డాక్టర్ మణిభూషణ్, వైద్య సిబ్బంది సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

శివకుమార్‌కు అభినందనలు



శివకుమార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ జెండా రాష్ట్రంలో మరోసారి ఎగర వేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ పిలుపునిచ్చారు. సంతవురిటి గ్రామానికి చెందిన పిల్లల శివకుమార్‌కు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించిన సందర్భంగా సోమవారం అభినందనలు తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రతీ ఒక్క కార్యకర్త సమన్వయంతో పనిచేసి మరింత బలోపేతం చేయాలన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగనన్నకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, చిత్తిరి మోహన్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు గేదెల నారాయణరావు, నాయకులు కర్రి వైకుంఠేశ్వరరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు, తోలేటి గురువులు పాల్గొన్నారు.

● ఉత్సాహంగా ప్రమాణ స్వీకారోత్సవం







వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో 46 మందితో కూడిన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు పాల్గొన్నారు. మంత్రి ధర్మాన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. – శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

సత్యసాయి సంస్థల కృషి అభినందనీయం

● మంత్రి ధర్మాన ప్రసాదరావు
● స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీకాకుళం కల్చరల్:

యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనం మేడపై స్కిల్ డెవలప్‌మెంట్ శాశ్వత భవన నిర్మాణం కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి ద్వారా నిరుద్యోగ సమస్య తగ్గించవచ్చన్నారు. ప్రతి యువత శిక్షణలో పాల్గొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం కోసం హైదరాబాద్‌కు చెందిన హనుమంతు తులసీరావు, విశాఖకు చెందిన శ్రీలక్ష్మి చెరో లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, గొండు కృష్ణ, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, ప్రొఫెసర్ గుంట తులసీరావు, మందిరం కన్వీనర్ ప్రసాదరావు, డోకి జనార్దనరావు, అప్పారావు, జి.రమణబాబు, మండవిల్లి రవి, కిల్లాన ఫాల్గుణరావు, నాగేశ్వరరావు, నర్సింహమూర్తి, ప్రమీల, సుజాత, పెద్ద మందిరం కన్వీనర్ కె.మురళి, విక్రమ్‌శర్మ పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 30వ తేదీన శ్రీకాకుళంలోని నెహ్రూ యువకేంద్రం ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ సోమవారం తెలిపారు. ఎస్‌బీఐ కార్డులు, ఎంఎస్ సున్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో వివిధ ఖాళీల భర్తీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆ రోజు ఉదయం పది గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన సీఐ



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కామేశ్వరరావు

గార: గార స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొందిన ఎస్.కామేశ్వరరావు మంత్రి ధర్మాన ప్రసాదరావును తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. ఇదివరలో పనిచేసిన మాదిరిగానే నిబద్ధతతో విధులు నిర్వహించాలని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి ఉన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఫరీదుపేట, ఇబ్రహీంబాద్, జరజాం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి చేసేందుకు సమష్టి కృషితో పనిచేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటినవారికి ఓటు హక్కు ప్రాధాన్యతపై చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ సీరపు శ్రీరామ్మూర్తి, సూర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంపీపీ రఘురామ్

గార: అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ జయరాంలు తమ సొంత నిధులతో క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రూ. 8 వేలు విలువ గల వాలీబాల్, బ్యాట్మింటన్ క్రీడా సామగ్రిని హెచ్‌ఎం జ్యోతి లక్ష్మీ నారాయణకు అందించారు. ఎంపీపీ రఘురామ్ మాట్లాడుతూ.. క్రీడలు వలన ఉల్లాసంతో పాటు ఉత్సాహం, ఆరోగ్యం కలుగుతుందని, విద్యలో కూడా రాణిస్తారన్నారు. క్రీడల వలన ఉద్యోగాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణ, పీఈటీ పి.శ్రీనివాస్, సీతారామరాజు ఉన్నారు.

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

జి.సిగడాం: విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహించ వద్దని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూసర్వే, స్పందనపై వచ్చిన ఫిర్యాదులపై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించాలన్నారు. ఇప్పటికే సర్వే చేసిన గ్రామాల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ హనుమంతురావు, సర్వేయర్లు జి.కృష్ణారావు, మొయ్యి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధులు బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు తగరం కిరణ్‌బాబుపై వీరవల్లి పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసి వేధించడం, అదే బార్ అసోసియేషన్ సభ్యుడు ఆవుల ప్రవీణ్‌కుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల దాడి చేసి గాయపరచడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరణ, ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో వచ్చే స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయల్లో రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరు, జగనన్న కాలనీల్లో స్థలాలు కావాలని, పారిశుద్ధ్య సమస్యలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి సమస్యలపై స్పందనలో తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. స్పందనలో వచ్చిన ప్రతీ ఫిర్యాదు 24 గంటలలోగా సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.దుర్గారావు, ఇంచార్జి ఎంపీడీఓ ధనుంజయరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చక్రధరరావు మృతి తీరనిలోటు



చక్రధరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ధర్మాన తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్థానిక కలెక్టర్ బంగ్లా దరికి చెందిన రిటైర్డు ఎక్స్‌టెన్షన్ పంచాయతీ ఆఫీసర్, ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ది ఇయర్ ఆర్గనైజేషన్ కార్యదర్శి చెక్కెర చక్రధరరావు అకాల మరణ తనకు వ్యక్తిగతంగా తీరని లోటని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. చక్రధరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమాజ సేవలో, కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణంలో చక్రధరరావు విశిష్టమైన సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మంత్రి వెంట వ్యాపారవేత్త ద్వారపూడి శ్రీనివాసులురెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, దక్షిణ భారత హిందీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, మాజీ కౌన్సిలర్ కర్నేన పద్మావతి, డాక్టర్ వినీలబాయ్ పట్నాయక్, కర్నేన హరిబాబు, వల్లభ నారాయణ, బి.సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ నాయకులు కల్లేపల్లి శ్యాంసుందర్‌రావు ఉన్నారు.

నగదు రహిత లావాదేవీలు ప్రారంభించాలి



సామగ్రిని అందజేస్తున్న రమణయ్య

గార: సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టల్ విభాగంలో నగదు రహిత లావాదేవీలు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో సంజీవ రమణయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్టేట్‌బ్యాంకు గార బ్రాంచి ద్వారా వచ్చిన డిజిటల్ సామగ్రిని సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలను డిజిటల్ పంచాయతీలగా ప్రకటిచిందని, సచివాలయాల్లో ప్రజలకు అందించే వివిధ రకాల సేవలకు నగదు రహితంగా జరిపేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా లావాదేవీలకు సంబంధించిన సామగ్రిని ఇవ్వడం జరిగిందన్నారు. సేవలు అతివేగంగా అందేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ పి.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల హర్షం

శ్రీకాకుళం అర్బన్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్ ఆలిండియా స్థాయిలో స్టాఫ్ ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రీజనల్ సెక్రెటరీ కె.సి.హెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం రామలక్ష్మణ జంక్షన్ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో ఉన్న అన్ని ఎస్‌బీఐ శాఖల ఉద్యోగులు చంద్రశేఖర్ నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సందడి చేశారు.

లే అవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని చిలకపాలెం పరిధిలో 126/1 సర్వే నంబర్, సబ్ డివిజన్ 29లో 4.22 ఎకరాల్లో అక్రమంగా లేవుట్ వేశారని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీపీ సమక్షంలో ఈఓపీఆర్డీ కణితి ఈశ్వరి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సోమవారం లేఅవుట్‌ను పరిశీలించారు. 40 అడుగుల రోడ్డు, రిజర్వు స్థలం ఉండాలనే నిబంధన తదితర అంశాలను పరిశీలించారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్‌ను అభినందిస్తున్న నాయకులు

రణస్థలం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీకి పెద్దన్న అని పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలో ధర్మాన కృష్ణదాస్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొని ఆయనను సత్కరించారు. పార్టీ మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, పిళ్లా ఆనందరావుపాత్రుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చిన రామినాయుడు, బొమ్మలాట శ్రీరాము, బడి రాంబాబు, మహంతి జోగినాయుడు, మింది శ్రీనివాస్, మహంతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో ఖర్చు ఆదా



సీడ్ డ్రిల్ యంత్రాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

రణస్థలం: సాగు ఖర్చులు అధిగమించడానికి రైతులు ఆధునిక, సాంకేతిక పద్ధతులు అవలంభించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ సూచించారు. పైడిభీమవరం గ్రామ పరిధిలోని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విత్తనం, ఎరువు ఒకేసారి వేసే (ఫెర్టీ కమ్ సీడ్ డ్రిల్) యంత్రాలను సోమవారం రాయితీపై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రాల ద్వారా వరి సాగు చేస్తే సుమారు రూ.5వేల వరకు ఆదా అవుతుందన్నారు. రైతు శిక్షణ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ త్రినాథ్ స్వామి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రసాయన ఎరువులు విరివిగా వాడటం వల్ల నిస్సారమవుతుందన్నారు. రైతులకు వ్యవసాయ యంత్రాలు అందుబాటులోని తీసుకురావడానికి కృషి చేస్తున్న డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సేవలను వ్యవసాయాధికారులు కొనియాడారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు మాట్లాడుతూ 14 మండలాల్లో వెద పద్ధతిలో వరి సాగు కోసం 25 యంత్రాలను వడ్డీలేని రుణాలతో అందజేశామన్నారు. రైతులు ఈ యంత్రాలను వినియోగించుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం ఏడీఏ వి.శ్రీనివాసరావు, ఏఓ డి.విజయభాస్కర్, ఫౌండేషన్ సిబ్బంది పి.తవిటినాయుడు, బి.లక్ష్మీనరసింహ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విచ్చల విడిగా పందుల సంచారం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో ఎక్కడకక్కడ పందులు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో పెద్దపెద్ద అరుపులతో ప్రజలకు నిద్రకూడా పట్టనివ్వని పరిస్థితి నెలకుంది. పందులు తిరుగుతున్న విషయమై పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన వాటిని నియంత్రించడం లేదని జనం వాపోతున్నారు. పందుల సంచారంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. హడ్కోకాలనీ, బొందిలీపురం, బలగ, బ్యాంకర్స్‌కాలనీ, ఆఫీషియల్‌కాలనీ, గుజరాతీ పేట, హయాతీనగర్, పీఎన్‌కాలనీలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పందుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థినుల ట్రాఫిక్ సేవలు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద సోమవారం రాత్రి విద్యార్థినులు గంటపాటు ట్రాఫిక్ సేవలు అందించారు. బ్రీత్ ఎనలైజర్స్‌తో వాహనదారులను తనిఖీలు చేశారు. ఎస్పీ రాధిక సూచనల మేరకు సూపర్ కాప్స్ ఫేజ్–2లో భాగంగా ట్రాఫిక్ ఎస్సై పి.వి.రమణ ఆధ్వర్యంలో రాత్రి ఆరు గంటల నుంచి ఏడు వరకు సేవలందించారు. ఎస్సై రమణ మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

తెలుగు భాష సంరక్షణకు ఉద్యమించాలి

శ్రీకాకుళం అర్బన్: తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందని గరిమెళ్ల విజ్ఞానకేంద్రం జిల్లా అధ్యక్షుడు వి.జె.కె.మూర్తి అన్నారు. వ్యవహారికభాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతిల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 13 కోట్ల మంది ఉన్నారన్నారు. ఒకప్పుడు దేశంలో రెండో అతిపెద్ద భాషగా వెలుగొందిన తెలుగుభాష ప్రస్తుతం నాలుగో స్థానానికి దిగజారిపోడానికి పాలకుల విధానాలే కారణమన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ మాటాడుతూ.. చాందసుల గుప్పెట్లో గ్రాంధికభాషగా మగ్గిపోయిన తెలుగు భాషను సామాన్యుల వ్యవహారభాషగా తేవదానికి గిడుగు, గురజాడలు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధిపతి పి.వి.రమణ, ప్రిన్సిపాల్ పి.సురేఖ, సహాయ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తెలుగు అధ్యాపకులు నారాయణరావు, ఆర్.మధు, ఉప్పు త్రినాధరావు, ప్రకాష్, ఎస్.రమణ, పి.సుధాకరరావు పాల్గొన్నారు.

విజేతలుగా రండి..

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్టణం, ఒంగోలులో జరగనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి విజేతలుగా రావాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ ఆకాంక్షించారు. విశాఖలో జరగనున్న అండర్–15, ఒంగోలులో జరగనున్న అండర్–13 బాల,బాలికలకు క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమం సోమవారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని ఇండోర్‌స్టేడియం వేదికగా జరిగింది. క్రీడాదుస్తులను జి.భీమారావు స్పాన్సర్ చేశారు. రాను, పోను ఖర్చులకు ఆయనతోపాటు బ్యాడ్మింటన్ సంఘం సాయం చేసింది. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, సీతఈవో సంపతిరావు సూరిబాబు పాల్గొన్నారు.